# అమెరి'కులాసా' కథలు

## - వంగూరి చిట్టెన్ రాజు





# -48-

## ఇంత చలేస్తుంటే వేన్నీళ్ళు ఎందుకే?

మాంగల్య బలమో, తోదికోడళ్లో గుర్తు రావడం లేదు కానీ అందులో కాస్త మతి మరపు ఉన్న లాయర్ ఎస్వీ రంగా రావు ఆఫీసులో పొద్దున్నే కూచుని ఉండగా "వేన్నీళ్ళు పెట్టాను. స్నానానికి లే నాన్నా" అని కూతురు అనగానే ఆ మహా నటుడు తడుముకోకుండా "ఇంత చలేస్తుంటే వేన్నీళ్ళు ఎందుకే?" అంటాడు అమాయకంగా. అంత సునిశితమైన హాస్యం ఎంత హాయిగా ఉంటుందో ఎప్పుడు తలచుకున్నా. మొన్న కూడా అదే జ్ఞాపకం వచ్చి భలే నవ్వుకున్నాను ఆ నాటి హాస్యానికి. అది ఎందుకు జ్ఞాపకం వచ్చిందీ అంటే మా టెక్సస్ లో మొన్న అలాగే చచ్చే చలివేసింది. అప్పుడే మాకు రాని వేన్నీళ్ళు, ఎస్వీ ఆరూ జ్ఞాపకంవచ్చారు.

మా హ్యూస్టన్ లో నాకు తెలిసీ గత 45 ఏళ్లలో వాతావరణం అంత దౌర్భాగ్యంగా ఎప్పుడూ లేదు. అనగా....మా ఇంటి బయట ఉష్ణోగ్రత 15 డిగ్రీల ఫారన్ హీట్...అంటే నీరు గడ్డ కట్టుకుని మంచులా మారిపోయే 32 డిగ్రీల కంటే తక్కువ. పైగా ఈ సారి ఇతర వాతావరణ పరిస్థితులని బట్టి ఏకంగా నాలుగు అంగుళాలు తెల్ల గా మంచు తునకల వర్షం కూడా కురిసింది. 'ఓస్ ఇంతేనా నాన్నా' అని రెండు అడుగుల మంచు మూడు నెలల పాటు ఆనందంగా అనుభవించే చికాగో వారూ, బోస్టన్ వారూ అనుకో వచ్చునేమో కానీ టెక్సస్ పీత కష్టాలు పీతవే. ఈ అతి తక్కువ ఉష్ణోగ్రతలు అతి పెద్ద రాష్ట్రం అయిన మా టెక్సస్ అంతా వ్యాపించడం తో ఇక్కడి విద్యుచ్ఛక్తి ఉత్పత్తి చేసే రక రకాల ప్లాంట్స్ కి కొంప మునిగి మమ్మల్ని ముంచాయి. టెక్సస్ లో వేడి వాతావరణానికి అలవాటు పడిన సహజ వాయువు తో నడిచే పైపులన్నీ గడ్డ కట్టుకు పోయీ, ఎలెక్ట్రిసిటీ తయారు చేసే గ్గాలి పంకాలు బిగుసుకు పోయీ రాష్ట్రం మొత్తం విద్యుచ్ఛక్తి సరఫరా 90 శాతం పడిపోయింది. అనగా....అమెరికా మొత్తానికి 11 శాతం విద్యుచ్ఛక్తి సరఫరా చేసే మాకు మిగతా దేశంతో సంబంధం లేదు అని అన్ని పక్క రాష్ట్రాలాల తోటీ "వైర్లు" కట్ చేసేసుకున్న మా టెక్సస్ వాళ్ళ దగ్గర నుంచి ఈ అత్యవసర పరిస్థితులలో "కరెంట్' కొనుక్కో లేక ముదిరి కరోనా లాగా 'కరెంట్ ఐసేయూ' లోకి

వెళ్ళిపోయింది. పోతే పోయింది. మాలాంటి రెండు దేశాల దేశ భక్తులనీ వదిలేయ్య వచ్చును కదా...అబ్బే.....మమ్మల్ని కూడా కాటు వేసింది. ఏకంగా నాలుగు రోజులు మా ఇంట్లో కరెంట్ ఊష్ కాకీ.

వెంటనే నాకు మాయా బజార్ లో రంగారావు 'వివాహ భోజనంబు " చేసేశాక శర్మా , శాస్త్రీ గుర్తు కొచ్చారు.

ఎటొచ్చీ, నేనేమో శర్మా, మా క్వీన్ విక్టోరియా ఏమో శాస్త్రీ అనమాట.

ఇంట్లో లైట్లూ – ఖాళీ

హీటరూ–ఖాళీ

వాటరూ–ఖాళీ

కిచెన్ లో గేసూ–ఖాళీ.

కడుపు లో–ఖాళీ బాబోయ్ ఖాళీ

ఇంటర్ నెట్టూ–ఖాళీ

సెల్ ఫోనూ–ఏమో ఎక్కడ చచ్చిందో?

అదీ సంగతి.

అంత పెద్దదీ, మరీ చిన్నదీ కాని ఇంట్లో కటిక చీకట్లో మా క్వీన్ విక్టోరియా. పక్కనో, ఎక్కడో హడిలి చచ్చి పోతూ నేనూ. ఆ సీన్ తలచుకుంటే ఇప్పటికీ ఎంత భయం వేస్తుందో కదా!.

ఇక కరెంట్ షాక్ కొట్టదు అని తెలిసిపోయింది కాబట్టి మెల్లిగా ఆ గోడా, ఈ గోడా పట్టుకుని ఆవిడకి బాగా తెలిసిన దేవుడి గది లోకి బహుశా పాక్కుంటూ వెళ్ళిందో, వెళ్ళాక నెల మీద సాష్టాంగ పడిందో కనపడ లేదు కానీ మొత్తానికి అక్కడ, టీ లైట్ అనే ముద్దు పేరున్న చిన్న ప్లాస్టిక్ దిన్నె లో ఉండే కొవ్వొత్తి వెలిగించింది మా ఇంటి దీపం. అగ్గి పెట్టె, గుడ్డి దీపం, వత్తులు దాచుకోదానికే ఎవరింట్లో అయినా ఈ దేవుడి గది కట్టుకుంటారని అప్పుడు నాకు స్పష్టంగా అర్థం అయింది. అలాగే ఇంటికి దీపం ఇల్లాలే అంటే 'నువ్వూ ఉన్నావు ఎందుకూ?" అని కూడా అర్థం అయింది.

ఇహ ఆ 'మసక మసక చీకట్లో' నేను రెచ్చి పోయాను. అంటే అదేమీ ఎల్లారీశ్వరి టైపు లో కాదు. ఇంట్లో ఎక్కడైనా పెట్రోమాక్స్ లైట్లు పొరపాటున ఉన్నాయేమో అని వెతుకుడు కార్యక్రమం అనమాట. పోనీ బేటరీ లైటో?. ఆ గొట్టాం లైటు ఏదో సొరుగులో కనపడింది వెధవది..బేటరీలు ఎక్కడున్నాయో?

"బేటరీలా? ఇంట్లో ఉంటే వేడికి డాం అని పేల్తాయేమో అని గరాజ్ లో దాచాను." అంది క్వీన్ విక్టోరియా.

'ఉద్ధరించావు. అసలు నా బేటరీలు ముట్టుకోమని చెప్పానా? ఆ దేవుడి గదిలో నీ అగ్గిపెట్టె నేనేమన్నా గరాజ్ లో దాచేశానా?' –నాకు అంతకన్నా ఏం అనాలో తెలియ లేదు.

మొత్తానికి ఆ చీకట్లో చిందులాట లో నాలుగ్గైదు సువాసనలు వెదజల్లే కొవ్వొత్తులు దొరికాయి. "చూశావా, ఎంత మంచి కునేగా మరికొళుందు లాంటి వాసనో?" –శర్మ టాపిక్ మార్చాడు.

"చాల్లే. ఇప్పుడు అదొక్కటే తక్కువ." శాస్త్రి కోప్పడింది.

ఇక సీన్ మారింది. ఆయా కొవ్వొత్తులు ఒక వ్యూహం ప్రకారం ఇంట్లో అక్కడక్కడా అమిర్చి, ఇద్దరం సోఫాలో చతికిల పడ్డాం. మామూలు గా అయితే రిమోట్ కోసం కొట్టుకు చచ్చే వాళ్ళమే కానీ ఇప్పుడు అదెక్కడుందో తెలియకా, తెలిసినా ఎక్కడ నొక్కిన అక్కడనే ఉండును కాబట్టీ మా ఎదురుగుండానే  గోడ మీద బిగించబడి మా కేసి నిస్సహాయంగా చూస్తూ నిట్టూరుస్తున్న ఒకానొక సోనీ కంపెనీ వారి నల్ల డబ్బా కేసి ఇద్దరం నిస్సహాయంగా కాస్సేపు చూశాం. కాస్సేపయ్యాక నా శరీర ఉష్ణోగ్రత లో ఏదో తేడా కనపడింది. అనగా....అంత సేపూ మా ఇంటి బయటే 15 డిగ్రీల ఆట ఆడుకున్న వాతావరణం లోపల కూడా తగ్గు ముఖం పట్టింది. నేను ఇంజనీరింగ్ లో నేర్చుకుని ఏనాడో మర్చిపోయిన ఆ వెధవ హీట్ ట్రాన్స్ ఫర్ సబ్జెక్ట్ మళ్ళీ జ్ఞాపకం వచ్చి, "గంట క్రితం ఇంట్లో 76 డిగ్రీల తో హాయిగా ఉన్నది ఇప్పుడు ఇంత తగ్గడాన్ని కన్వెక్షన్ అంటారు. దాని ఈక్వేషన్ ఏమిటంటే q=(^T) h ..అంటే...."నేను ఆవేశపడుతుంటే ఆమె నాకేసి చూసిన చూపు మాంగల్య బలం లోనో, తోడికోడలు లోనో సూర్యాకాంతం ఎస్వీ రంగారావు కేసి కూడా చూడ లేదు. అంతే కాదు. తటాలున లేచి, విసురుగా కాఫీ బల్ల ని తన్ని అయ్యో, కుయ్యో ధ్వనులు చేసి స్పీడు తగ్గించి, మా పడక గదిలోకి వెళ్లి, ఐదు నిముషములలో ఐదో, పదో రొజాయిలు, దుప్పట్లు కప్పుకుని  వచ్చెను. వచ్చుటయే కాక నా వాటా నాకు ఇచ్చి అర్ధాంగి అనిపించు కొనెను. అటు పిమ్మట నాకు హీట్ ట్రాన్స్ ఫర్ లో కండక్షన్ సిద్ధాంతం చూచాయగా అనుభవం లోకి వచ్చెను.

ఇక ఆ తరువాత మూడు, నాలుగు రోజులు నాది రొజాయి వేషమే. మహా అయితే సోఫా మీద ముడుచుకు పోయి కూచునే బదులు మంచం మీద మూడంకే వెయ్యడమే. ఆ ఐదు  దుప్పట్లు మాత్రం మార్చ లేదు.  ఇక మూడో రోజు అనుకుంటాను. ఒక కొంచెం ఇబ్బంది వచ్చింది.  ఆ సోఫా మీద కూచుని విశాల విశ్వం లోకి చూస్తున్నప్పుడు, వేళాపాళా చూసుకోకుండా వెధవ వీపు కాస్త దురద పెట్టి గోక్కోవలసి వచ్చింది. అప్పుడు నా కుడి చేతిని మెల్లిగా ఆ దుప్పట్ల మధ్యలోంచి మెడ వేపు సారించి, సుతారంగా చేతి వేళ్ళు వీపుకి ఆనించే ప్రయత్నం లో అప్రయత్నంగానే అవి దుప్పటి లోనించి బయటకి వచ్చి, అక్కడి ఉష్ణోగ్రతని బట్టి పిడచ కట్టుకు పోయాయి. తద్వారా కన్వెక్షన్, కండక్షన్ ప్రక్రియలకి అంతరాయం ఏర్పడింది. అప్పుడు నేను ఎడం చేత్తో కట్టు విడుపు ప్రయత్నం చెయ్యగా పరిస్థితి వికటించి నేను యోగా పొజిషన్ లో అతుక్కు పోయాను.  అంటే అఘోరా యోగులు తమ తలకాయ చుట్టూ కాళ్ళు చుట్టేసి, వాటన్నింటి చుట్టూ చేతులు అల్లేసి, అచ్చు మెడికల్ కాలేజీలలో గాజు సీసాలలో పెట్టిన శిశువు లాగా కనపడే పొజిషన్ అనమాట. అప్పుడు నాకు అభిమన్యుడి లాగా యోగా ఆసనం వెయ్యడమే కానీ తియ్యడం రాదు అర్ధం అయింది.  అప్పుడు తనదే అయిన

శూన్యం లోకి చూసుకుంటూ కాలం గడుపుతున్న మా క్వీన్ విక్టోరియా కి నా గుర్ గుర్ శబ్దాలు వినపడి, విషయం గ్రహించి "పోనీ నన్ను సాయం చెయ్యమంటావా?" అని నా వీపు వేపు మొన్ననే సరదాగా పెంచుకున్న గోళ్ళని ఆనించగానే నేను ఆవిడ కేసి చూసిన చూపు ఉంది చూశారూ. అదే టైపుకి రివర్స్. ఇహ చేసేదేముంది. నానా అవస్థా పడి కొంకర్లు పడబోయిన ఆ వేళ్ళనీ, చేతులనీ స్వాధీనం లోకి తెచ్చుకుని, ఆ వెధవ వీపు సంగతి ఆ సృష్టి కర్తకే వదిలేశాను. ఆయనే కదా కారు అద్దాలకి వైపర్ లా మానవుడి వీపుకి కూడా ఏదో పెట్టి ఉంటే నాకీ యోగం తప్పేది కదా!.

నిజం చెప్పాలంటే...

అంత చలేస్తున్నా మాకు వేన్నీళ్ళు వచ్చాయి సుమా.

చాలా మందితో పోల్చి చూస్తే నిజానికి మా పరిస్థితి మరీ అంత అన్యాయంగా లేదనే చెప్పాలి. కరెంట్ పోవడం, అంచేత హీటింగ్ లేక చలి ఎక్కువ కావడం నిజమే కానీ మాకు నీటి సౌకర్యం, వంటింట్లో గాస్ స్టవ్ లు బాగానే పని చెయ్యడం, సరుకులు ముందే తెచ్చుకుని జాగ్రత్త పడడం తో ఆ ప్రమాదకర వాతావరణం లో బయటకి వెళ్ళ వలసిన అవసరం లేకుండా గండం గడిచిపోయింది. కంప్యూటర్, ఇంటర్నెట్ లేక పోయినా, అటు, ఇటూ గా పనిచేసిన సెల్ ఫోన్లూ, పుస్తకాల వలనా కాలక్షేపం బాగానే జరిగింది. ఆ నాలుగు రోజులూ మమ్మల్ని వాట్సాప్, ఫోన్ లలో పలకరించి మా మీద ఎంతో అభిమానం కురిపించిన దేశ దేశాల మిత్రులకి వేన వేల ధన్యవాదాలు.



COMMENTS